GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 42 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం : అక్టోబర్-12-2024 | పేజీలు : 3








# నిరుపేదలకు మంచి వైద్యం, నాణ్యమైన విద్య లక్ష్యం

## సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా,అక్టోబర్ 11షాద్ నగర్ (హైదరాబాద్ ):**
తండాలు, మారుమూల పల్లెలు, బస్తీల్లో నివసించే నిరుపేదలకు మంచి వైద్యం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఒక ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. నిరుపేదలను విద్యకు దూరం చేయకూడదన్న ఆలోచనతో చాలా మంది మేధావులు, సామాజిక తత్వవేత్తలతో చర్చించిన మీదట యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. దసరా పండుగ శుభ సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గ్‌లో ఇంటిగ్రేటెట్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదిక నుంచి మాట్లాడుతూ ఆ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వేర్వేరు చోట్ల విద్యా బోధన వల్ల ఈ వ్యవస్థ మమ్మల్ని దూరం పెడుతుందన్న భావన విద్యార్థుల్లో కలిగే ప్రమాదం ఉంది. అలాంటి భావన సమాజానికి, దేశానికి మంచిది కాదు. అందుకే పాతిక ఎకరాల్లో ఒకే క్యాంపస్‌లో అందరూ కలిసిమెలిసి ఒక సోదర భావంతో చదువుకుని రాణించాలన్న సంకల్పంతో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. నిరుపేదలకు అన్ని రకాలైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఒక్కోచోట 120 నుంచి 150 కోట్ల రూపాయల వ్యయంతో ఈ క్యాంపస్‌లకు శంకుస్థాపన చేస్తున్నాం. ఒక్కో రెసిడెన్షియల్ స్కూల్‌లో దాదాపు 2500 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుని, భవిష్యత్తులో వారంతా ఉన్నతస్థాయికి ఎదగాలని, తద్వారా వారు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. నిరుపేదలను విద్యకు దూరం చేస్తే ఈ దేశ సంపదకే తీవ్ర నష్టం చేసిన వారమవుతాం. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో దాదాపు 5 వేల పాఠశాలలు మూసివేయబడ్డాయి. తద్వారా ముఖ్యంగా దళితులు, గిరిజనులు విద్యకు దూరమయ్యే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి.
పేదల కోసం పనిచేసే అధికారులను తప్పనిసరిగా ప్రభుత్వం, ప్రజలు ఎప్పుడూ అభినందిస్తారు. విద్యా ప్రమాణాలను పెంచాలన్న లక్ష్యంతోనే సుదీర్ఘ కాలంగా ప్రమోషన్లు లేక ఆందోళనకు గురవుతున్న సందర్భంలో రాష్ట్రంలో 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు కల్పించడమే కాకుండా ఎక్కడా వివాదాలకు తావులేకుండా 34 వేల మంది టీచర్లను బదిలీలు చేశాం. ఈ శంకుస్థాపన కార్యక్రమలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. "భగవంతుడు ప్రజలకు సుఖశాంతులు కలిగించాలి. పాడిపంటలు ఇవ్వాలని, పిల్లలకు మంచి చదువులు, ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

# జీఎస్టీ స్కామ్

## ఈడీ కేసు నమోదు

**టి మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్ :**


గత ప్రభుత్వ హయాంలో జరిగిన జీఎస్టీ స్కామ్ పై ఈడీ కేసు నమోదు చేసింది. జీఎస్టీ చెల్లింపుల్లో రూ.46 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఇప్పటికే దీనిపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈడీ కూడా దీనిపై కేసు నమోదు చేసింది. మాజీ సీఎస్ నేతృత్వంలో జీఎస్టీ స్కామ్ జరిగినట్టు నిర్ధారించిన ఈడీ అనర్హులకు జీఎస్టీ రీపేమెంట్ చేసినట్లు గుర్తించింది. కేసు వివరాలలోకి వెళితే తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సోమేశ్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపుల లావాదేవీల్లో దాదాపు రూ.46 కోట్ల స్కాం చేశారని ఆరోపణలొచ్చాయి. ఓ సంస్థ, ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈ స్కాం చేసినట్లు ప్రధాన ఆరోపణ. దీనిపై హైదరాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు. వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ కె. రవికుమార్ పోలీసు డిటెక్టివ్ విభాగానికి ఫిర్యాదు చేయగా.. ఆ ఫిర్యాదు మేరకు వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, ఎ. శివ రామ ప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశారు.

# తండ్రిని పట్టించుకోని కొడుకులకు జలక్

- దిమ్మతిరిగే షాకిచ్చిన అధికారులు
- డబుల్ బెడ్రూమ్ ఇంటిని రద్దు

**టి మీడియా, అక్టోబర్ 11, రాజన్న సిరిసిల్ల :**

అద్దాల నాడు బిడ్డలు కాని, గద్దాల నాడు కారు" అన్న సామెతను కొందరు ప్రబుద్ధులు నిజం చేస్తున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని ఘటనలను ఎన్నో చూశాం.. ఈక్రమంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలో కన్నతండ్రి పట్ల కొడుకులు కఠినంగా ప్రవర్తించారు. దీంతో వారికి దిమ్మతిరిగేలా షాకిచ్చారు అధికారులు. వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని పట్టించుకోవట్లేదంటూ కొడుకుకు మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని సిరిసిల్ల ఆర్డీవో రద్దు చేశారు. తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌లో తండ్రిని పోషించకుండా, ఇంట్లో ఉండడానికి చోటు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఇద్దరు కొడుకులకు సిరిసిల్ల ఆర్డీవో లోలావర్ రమేశ్ షాకిచ్చారు. గత ప్రభుత్వంలో కేటాయించిన డబుల్ బెడ్రూమ్ ఇంటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు ఆ ఇంటిని తండ్రికి ఇవ్వాలని కొడుకులకు గురువారం నోటీసులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లకు చెందిన అదువాల రాజమల్లుకు అనిల్ కుమార్, సురేశ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇంటిని కేటాయించింది. ఇల్లు రాజమల్లు పేరున ఇవ్వాల్సి ఉండగా పెద్దకొడుకు అనిల్ కుమార్ తన భార్య పేరిట రాయించుకున్నాడు. గత ఆరు నెలల నుంచి రాజమల్లును కొడుకులు పట్టించుకోకపోవడంతో దీంతో ఆయన రోడ్లపైనే ఉంటూ భిక్షాటన చేసి కడుపునింపుకుంటున్నాడు. ఈ క్రమంలో తనను కొడుకులు పట్టించుకోవడం లేదని ఆయన ఆర్డీవోకు మొరపెట్టుకున్నాడు. దీంతో తంగళ్లపల్లి ఎమ్మార్వోకు పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో రమేశ్ ఆదేశించారు. తంగళ్లపల్లి తహసీల్దార్ దీనిపై విచారించి కొడుకులు వృద్ధుడైన రాజమల్లును పట్టించుకోవడం లేదని నివేదించారు. దీంతో డబుల్ బెడ్రూమ్ ఇంట్లో ఉంటున్న పెద్ద కొడుకును వారం రోజుల్లో ఖాళీ చేసి, తండ్రికి అప్పగించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. అంతేకాదు కొడుకులు ఇద్దరూ ప్రతినెల తండ్రికి రూ.2 వేల చొప్పున చెల్లించాలని ఆర్డీవో ఆదేశించారు. డబుల్ బెడ్రూమ్ ఇంటిని రాజమల్లు పేరున మార్చాలని తహసీల్దారుకు సూచించారు. దీంతో రాజమల్లు పెద్దకొడుకు అనిల్ కుమార్‌కు రెవిన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. తనకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన అధికారులకు రాజమల్లు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో లోలావర్ రమేష్ అన్నారు.

# దసరా పండుగ శుభాకాంక్షలు

## సీఎం రేవంత్‌రెడ్డి

**టీ మీడియా,అక్టోబర్ 11,హైదరాబాద్ :**


దసరాపండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిశు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టనుదర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు.

# డీఎఫ్‌వో పై ఆరోపణలు

## విచారణకు ఆదేశించిన పవన్

**టీ మీడియా,అక్టోబర్ 11,అమరావతి:**


కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# టాటా ట్రస్టుల ఛైర్మన్‌గా నోయెల్ టాటా..

**టి మీడియా, అక్టోబర్ 11,ముంబై:**
ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణించిన తర్వాత నోయెల్ టాటా టాటా ట్రస్ట్‌ల ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. నోయెల్ టాటా టాటా స్టీల్ అండ్ వాచ్ కంపెనీ టైటాన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేస్తున్నాడు. రతన్ టాటా సవతి తల్లి కుమారుడే ఈ నోయెల్ టాటా.. అతను 2000 సంవత్సరంలోనే టాటా గ్రూప్‌లో చేరారు. టాటా ట్రస్ట్‌లో ప్రస్తుతం వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్, మెహ్లీ మిస్త్రీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. రతన్ టాటా తమ్ముడు జిమ్మీ కుటుంబ వ్యాపారంలో పాలు పంచుకోలేదు. దక్షిణ ముంబైలోని కొలాబాలో ఓ చిన్న అపార్ట్మెంట్లో నివసిస్తున్నాడు. 1937లో సాంప్రదాయ పార్సీ కుటుంబంలో జన్మించిన రతన్ టాటా తన 10వ ఏటా అతని తల్లిదండ్రులు నావల్-సూని టాటా విడాకులు తీసుకున్న తర్వాత అతని అమ్మమ్మ వద్ద పెరిగారు.

# దసరా పండుగకు ప్రత్యేక స్థానం : కేసీఆర్

**టీ మీడియా,అక్టోబర్ 11,హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని చెడు మీద నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి షమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించుకుని వారి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారం. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. అలాయ్ బలాయ్ తీసుకుని పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా దసరా పండుగ సందర్భంగా ప్రజల నడుమ సామాజిక సామరస్యం ఫరిడవిల్లుతుంది అని కేసీఆర్ తెలిపారు.






# కులగణనకు వేగంగా చర్యలు

- సీఎం రేవంత్ ప్రత్యేక చొరవ
- రాజకీయాలకు అతీతంగా హర్షం
- దశాబ్దాలుగా ఎన్నో ఉద్యమాలు

**టి మీడియా, అక్టోబర్ 11 ,హైదరాబాద్‌బ్యూరో :**
బలహీన వర్గాలకు సంబంధించి మరో ముందడుగు పడింది. బీసీల కులగణనకు సంబంధించి ప్రభుత్వం వేగం పెంచింది. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు బీసీల కులగణన చేపడతామని తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు తక్షణం ఏకసభ్య కమిషన్ నియమిస్తామని ప్రకటించింది. రెండు నెలల్లోనే నివేదిక సమర్పిస్తుందని తేల్చి చెప్పింది. అంతే కాకుండా, వెంటనే ఇంటింటి సర్వే మొదలు పెట్టింది. దీంతో బీసీల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తుండడంతో ఇక తమకు కూడా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం దక్కుతుందని బలహీనవర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. అసెంబ్లీ%ు% ఎన్నికల సందర్భంగా కాం గ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌ను కామారెడ్డి సభలో ప్రకటించింది.దీంతో స్థానిక సంస్థల్లో 42 శాతం వరకు రిజర్వేషన్లు లభించే అవకాశాలు ఉన్నాయని బీసీలు ఆశిస్తున్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే మెజారిటీ జనాభా బీసీలదే కావడం గమ నార్హం. రాష్ట్రంలో ఏబీసీడీ గ్రూపుల్లో 130 కులాలు ఉన్నాయని అంచనా. వీరంతా తమ సంప్రదాయాలను కొనసా గించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, సామాజి కంగా, ఆర్థికంగా ఏమాత్రం అభివృద్ధి వీరి దరికి చేరడం లేద న్నది వాస్తవం. ఒకపక్క దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమం ఊపందుకుంటున్న నేపథ్యంలో తెలంగాణలో తక్షణ ఆదే శాలు




వెలువడడం తమకు నిజమైన విజయదశమిగా ఆయా వర్గాలు భావిస్తున్నాయి.
ప్రభుత్వాలు సంకల్పించుకుని, నిర్దిష్టంగా తగిన ఆర్థిక ప్రణాళికలతో ముందుకు వస్తే తప్ప ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించడం అంత తేలిక కాదు. ఈ నేపథ్యంలో ఎన్నో ఉద్య మాలు పుట్టుకువచ్చాయి.ఎందరో నాయకులు తమ సర్వస్వాలను అర్పించారు. కాని, రకరకాల కారణాలతో ఏమాత్రం అడుగు ముందు కు పడలేదని బీసీల్లో తీవ్ర అసంతృప్తి జ్వా లలు ఎగిసిపడుతున్నాయి. ఈ నేపథ్యం లో తెలంగాణ సర్కా ర్ చొరవ చూపింది. ఏకసభ్య కమిషన్ నిర్దిష్ట కాలావధిలో నివేదికను సమర్పించిన అనంతరం రిజర్వేషన్లపై తగు నిర్ణయం తీసుకోను న్నారు. దీంతో బలహీనవర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగినంత ప్రాధాన్యం లభిస్తుం దని, దీంతో సామాజికంగా ఇతోధికంగా ఆయా కులాల వారు అభివృద్ధి సాధించడానికి మార్గం సుగమమవుతుందని సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ ప్రభు త్వంతో తీసుకున్న నిర్ణయం అమల్లోకి వస్తే దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని కేంద్రం, ఇతర రాష్ట్రాలు అనుసరించడానికి అవకాశం ఉంటుంది.

దీంతో దేశవ్యాప్తంగా వెనుకబాటుకు గురైన వెనుకబడిన తరగతులకు చెందిన వారు రిజర్వేషన్ ఫలాలను అందుకుని అభివృద్ధి పథంలో పయనిస్తారని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.బీసీల వెనుకబాటు తనం గురించి 1953లోనే దేశంలో కాలేల్కర్ కమిషన్ ఏర్పాటైంది. దేశం మొత్తం మీద 2399 వెనుకబడిన కులాలు ఉన్నాయని, అందులో 837 కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని కమిషన్ 1955లో తన నివే దికను సమర్పించింది. అయితే, కాలేల్కర్ కమిషన్ నివేదిక సిఫారసులను నాటి కేంద్రప్రభుత్వం తిరస్కరించింది. ఆ తర్వాత చాలా కాలానికి మండల్ కమిషన్ 1979లో ఏర్పాటైంది. ఈ కమిషన్ 1980 డిసెంబర్ 31న రాష్ట్రపతికి సమర్పించింది. దేశ జనాభాలో 52 శాతం బీసీలు ఉన్నారని మండల్ కమిషన్ నిర్ధారించింది. ఇందుకు సమానంగా రిజర్వేషన్లు ఉండాలని సిఫారసు చేసింది. సమస్య ఇక్కడే మొదలైంది. రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్నది దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం.ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 22.5 శాతం ఉం డగా, బీసీలకు 27 శాతానికి ప్రభుత్వం పరిమితం చేసింది. దేశంలో హిందూయేతరులను కూడా బీసీలుగా గుర్తించింది. మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని ఆనాటి ప్రధాని వీపీ సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. కాని, దేశవ్యాప్తంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో కచ్చి తంగా బీసీలకు మరింత మెరుగైన అవకాశాలు దక్కాలంటే ఎటువంటి పరిస్థితుల్లోనూ జనాభా ప్రతిపదికన రిజర్వేషన్లు దక్కాల్సిందేనని మేధావి వర్గాలు కూడా స్పష్టం చేస్తున్నాయి.

## దుర్గా మాత విగ్రహం ధ్వంసం

**టి మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్:**



హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో) ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి దాండియా కార్యక్రమం నిర్వహించారు. అయితే అర్ధరాత్రి సమయంలో కరంట్ కట్‌చేసి, సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి విగ్రహం చేతిని విరగొట్టారు. పూజా సామాగ్రిని చిందరవందరగా పడేశారు. అమ్మవారి చుట్టూ ఉన్న బారికేడ్స్‌ను తొలగించారు.శుక్రవారం ఉదయం గుర్తించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. అబిడ్స్ ఏసీపీ చంద్ర శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రతి ఏటా ఇలాగే దుండగులు హిందూ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## డా.అభివృద్ధికి కృషి చేస్తా

- చైర్మన్ కేశ వేణు



**టి మీడియా, అక్టోబర్ 11 నిజామాబాద్ :**
నుడా అభివృద్ధికి కృషి చేస్తానని నుడా చైర్మన్ కేశవేణు అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవీ బాధ్యతలు అప్పజెప్పినందుకు అధిష్టానానికి, రాష్ట్ర నాయకులకు, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా కేశవ వేణుని ప్రభుత్వం నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేసారు.శుక్రవారం హైదరాబాదులో నుడా చైర్మన్ గా కేశ వేణుకు, రాష్ట్ర రథసారథి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కేశవేణు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం హైదరాబాదులోని గాంధీభవన్ లో రాష్ట్ర రథసారథి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని కేశ వేణు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ%ొ% గత కొన్ని సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేశానని చెప్పారు. కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తప్ప కుండా గుర్తింపు ఉంటుదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న జబర్దస్త్ ఆర్టిస్టులు

**టీ మీడియా,అక్టోబర్ 11, ఆత్మకూరు:**



దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలు ఆత్మకూరు మండలంలో మరియు పలు గ్రామాలలో వైభవంగా కొనసాగుతున్నాయి 9వ రోజు దుర్గామాతగా అమ్మవారి భక్తులకు దర్శనం ఇచ్చారు ఆలయాల్లో మంట పాలు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఆలయాల వద్ద మండపాల వద్ద మహిళలు కోలాటాలు బొడ్డెమ్మలు బతుకమ్మలు వేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా జబర్దస్త్ నటులు సత్తిపండు, గుండు మూర్తి ,అలాగే సినీ ఆర్టిస్ట్ రంగరాజన్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని సందడి చేశారు గ్రామంలో ఉన్న మహిళలందరూ పాల్గొని దుర్గామాత ఆశీస్సులు తీసుకోవాలని గ్రామ ప్రజలకు ఆశీస్సులు ఉండాలని ఉండాలని జబర్దస్త్ ఆర్టిస్టులు కోరారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి ,మాజీ వైస్ ఎంపీపీ కోటేశ్వర్ ,ఏటి లక్ష్మణ్ ,రాంచంద్రయ్య దేవేందర్ ,నరేష్, బాలయ్య వెంకటన్న, కావలి తిరుపతన్న గ్రామ మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## అక్షయ పౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

- మహిళలకు బహుమతులు అందజేసిన సీపీఐ(ఎం), కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు

**టి మీడియా, అక్టోబర్ 11 ,ముదిగొండ**



ముదిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామంలో అక్షయ పౌండేషన్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆట, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న మహిళలకు సీపీఐ(ఎం), కాంగ్రెస్ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో 110 మందికి బాక్స్‌లను బహుమతిగా అందజేశారు. పాల్గొన్న మహిళలకు ప్రసాదాన్ని కందుల రంగారావు, బెజవాడ వంశీ అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు రాయల శ్రీనివాసరావు(చిన్నబాబు), కందుల బాలచందర్ బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్షయ పౌండేషన్ అధ్యక్షులు గంట నాగేశ్వరరావు మాట్లాడుతూ...ఇలాంటి సేవా కార్యక్రమాలు, సంబురాలు మీ అందరి ఆశీస్సులతో మరెన్నో చేయనున్నట్టు తెలిపారు. మహిళలు, గ్రామస్తులు, పెద్దలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సమస్యలపై వినతి

**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ని బి.ఆర్.ఎస్ నాయకులు కలసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. నల్లచెరువు కట్టపై ఉన్న గ్రిల్స్ కు కాంగ్రెస్ పార్టీ గుర్తు వచ్చేవిధంగా మూడు రంగుల కలర్స్ వేశారని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదే విధంగా పట్టణంలో ఫ్లెక్సీలు చెరువు కట్టలపై పరిశుభ్రత పట్ల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం గూర్చి వివరించడం జరిగింది.వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్,పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్,మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్, కౌన్సిలర్స్ బండారు.కృష్ణ,నాగన్న యాదవ్,స్టార్.రహీమ్,సయ్యద్. జమీల్ ఉన్నారు.

## విద్యుత్ కార్యాలయాల్లో ఆయుధ పూజలు

**టీ మీడియా, అక్టోబర్ 11, మహానంది:**



మహానంది మండలంలోని తిమ్మాపురం,బుక్కాపురం, మహానంది గ్రామాల్లోని సబ్ స్టేషన్లలోని విద్యుత్ శాఖ కార్యాలయాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బందికి, ప్రజలకు దసరా శుభకాంక్షలు తెలిపారు.విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా విధులు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మధుసూదన్ యాదవ్, లైన్ ఇన్స్పెక్టర్ శంకర్,నారాయణరెడ్డి, లైన్మెన్లు రాంపుల్లయ్య, విజయ్, రమణ,గురప్ప,సచివాలయం ఎనర్జీ సెక్రటరీలు చంద్ర, రాజశేఖర్, పవన్, కిరణ్, సాయి, బాషా, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా,అక్టోబర్ 11, చిన్నచింతకుంట:**



దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం ఫర్దిపూర్ గ్రామంలోని రిజర్వాయర్ లో తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లల పంపిణీ, చెరువులోకి చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి చేప పిల్లలను వదిలిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , ఈ కార్యక్రమంలో భాగంగా మొదట గ్రామంలో నెలకొల్పిన దుర్గ మాత అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ గారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులలో ఉచితంగా చేపలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దానికోసం 42 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉంచామని, నేడు పర్దిపూర్ రిజర్వాయర్ లో 60 వేల చేప పిల్లలను వదిలామని, త్వరలో కోయిల్ సాగర్ లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు, భారీ వర్షాల కారణంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లేట్ అయిందని, లేట్ అయిన కూడా చేపలు పెరిగి మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు, మీ అందరి ఆశీస్సులతో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, మీరందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని మత్స్యకారులను కోరారు.గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కగా దిద్దుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు, ఫర్దిపూర్ గ్రామంలో కొన్నేళ్లు పెండింగ్ లో ఉన్న సిసి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు, అదేవిధంగా ముదిరాజ్ సోదరుల విజ్ఞప్తి మేరకు ముదిరాజ్ కమ్యూనిటీ భవన కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల నుండి రెండు లక్షల రూపాయలను వెంటనే మంజూరు చేశారు.

## పట్నం జనం పల్లెబాట..

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

**టి మీడియా, అక్టోబర్ 11,హైదరాబాద్:**



రాష్ట్రంలో అతిపెద్ద పండుగ అయిన దసరాకు ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. పండుగకు బంధువులు, స్నేహితులను కలుసుకోవడానికి అవకాశం ఉండటంతో కుటుంబంతో కలిసి ఇంటిబాట పట్టారు. ఆర్టీసీ బస్సులు, సొంత, ప్రైవేటు వాహనాల్లో పట్నం వాసులు పల్లె బాట పట్టడంతో హైదరాబాద్ ఖాళీ అవుతున్నది. దీంతో రాజధాని నుంచి జిల్లాలకు వెళ్లే రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఈ క్రమంలో యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఉన్న పంతంగి టోల్ ప్లాజావద్ద వాహనాలు క్యూకట్టాయి. పండుగ వాహనాలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. అదేవిధంగా హైదరాబాద్-వరంగల్ రహదారిపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది.కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సర్వీసులను నడిపిస్తున్నాయి. రద్దీకి అనుగుణంగా సర్వీసులను పెంచేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. త్యేక బస్సుల్లో సుమారు మూడు లక్షలకు పైగా ప్రయాణికులు తమ స్వస్థలాలకు క్షేమంగా చేరుకున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపిస్తున్నామంటున్న యంత్రాంగం, 13, 14 తేదీల్లో తిరుగు ప్రయాణానికి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. అయితే మరిన్ని అదనపు సర్వీసులు నడపాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. పిల్లాపాపలతో ఊరెళ్లాలంటే గంటల కొద్దీ రోడ్లపై నిరీక్షించాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

## లోక్ పైలట్ హత్య

- నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు
- గంజాయి బ్యాచ్ ఆగడాలు

**టి మీడియా, అక్టోబర్ 11, విజయవాడ**



విజయవాడలో గంజాయి బ్యాచ్ ఆగడాలు ఆగడాలు శృతి మించిపోయాయి. రైల్వేస్టేషన్‌లో లోకోపైలట్‌పై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. విధులకు వెళ్తుండగా లోకో పైలట్ తలపై నిందితుడు రాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.ఈ సంఘటనతో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. తోటి లోకో పైలట్ హత్యకు గురవ్వడంపై రైల్వే లోకో పైలట్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. గతంలో చాలాసార్లు దాడి చేశారంటున్నారు రైల్వే సిబ్బంది. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రక్షణ లేదని.. తరచూ గంజాయి బ్యాచ్ ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని.. నిందితులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పోలీసుల అదుపులో నిందితుడు

కాగా ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. గుడివాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. డబ్బుల కోసం నిందితుడు ఈ హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అతడిది బిహార్‌గా చెబుతున్నారు. పూర్తి విచారణ తర్వాత నిందితుడి క్రైమ్ హిస్టరీపై పూర్తి క్లారిటీ రానుంది.

## అకాల వర్షం రైతుల పాలిట శాపం



**టీ మీడియా అక్టోబర్ 11 ఆత్మకూర్:**
అకాల వర్షానికి పలు గ్రామాలలో వరి చేను మొత్తం నేలమట్టం అయ్యింది. నష్టపోయిన రైతులనుప్రభుత్వం ఆదుకోవాలని వినతి. అకస్మాత్తుగా కురిసిన వర్షాలకు రైతులకు తీరం నష్టం జరిగింది. నీలమట్టమైన వరి నారిని చూసి రైతు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయాడు.

## దుకాణాల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పాత మార్కెట్ యార్డులో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయ దుకాణాల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఇందులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులకు సూచించారు. డిప్పు పద్ధతి ద్వారా చేపట్టిన లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమానికి ఎమ్మెల్యే, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ పిహెచ్సి క్యాటగిరి ప్రకారం ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరాలని ఇందులో ఎలాంటి పొరపాటు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.ఎంపికైన లబ్ధిదారుల వివరాలను కేటగిరి వైజ్గా ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ జిల్లా అధికారి స్వరంజిత్ సింగ్, టెలికం బోర్డు మెంబర్ శంకర్ ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడినందుకు ఫిర్యాదు

- బచ్చురామ్

**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లాలో రేషన్ డీలర్లకు జిల్లాలో అధ్యక్షులు బచ్చురామును కాంగ్రెస్ నాయకులు ఎదుర్కోలేక వనపర్తి ప్యాటగడ్డ రేషన్ షాప్ నెంబర్ 9 వనపర్తి బచ్చురాము ఇన్చార్జిగా కొనసాగుతున్న తరుణంలో కాంగ్రెస్ చైర్మన్, వైస్ చైర్మన్ ( 450 గ్రాముల) బియ్యం తక్కువ ఇస్తున్నాడు అని చెప్పి ఎమ్మార్వో కి రేషన్ షాప్ ఇన్చార్జి తొలగించడం జరిగింది.వనపర్తిలో బచ్చురాము కి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. పీఎం విశ్వకర్మ లక్ష రూపాయల లోన్ ఇప్పించడం, వనపర్తి ఆర్టీసీలో మహిళలకు టాయిలెట్స్ కట్టించడం, డి ఎంకి ఆర్‌ఎం కి జర్నల్ మేనేజర్ హైదరాబాద్ సజ్జనార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వనపర్తి ఆర్టీసీ బస్టాండ్ లో టాయిలెట్స్ కట్టడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ కి వీధిలైట్లు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కి కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. జమ్మలమ్మ గుడి నిరసన దీక్షలో గుడికి దారి ఇవ్వాలని ఒక రోజు దీక్ష చేయడం జరిగింది. గవర్నమెంట్ హాస్పిటల్ లో డాక్టర్ల కొరతపై కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. చింతల హనుమాన్ గుడి రోడ్డు లేనందున త్వరగా వెయ్యాలని కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వనపర్తి లో కుక్కలు రోజురోజుకు పిల్లల మీద జరుగుతున్న అఘాయిత్యాలను కలెక్టర్ కి కమిషన్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది .15 ఆగస్టు 78 మీటర్ల జెండా కార్యక్రమం వనపర్తిలో అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున పట్టణ బచ్చురాము ఆధ్వర్యంలో జరగడం వనపర్తిలో ఒక విశేషంగా జరిగింది. వనపర్తి బచ్చు రాము వనపర్తి ఎమ్మెల్యేకి రేషన్ డీలర్లకు కమిషన్ తక్కువ వస్తుందని రాష్ట్ర ప్రభుత్వము ఎలక్షన్ ముందర ఇచ్చిన 5000 రూపాయలు గౌరవ వేతనం ఇస్తారని హామీని నెరవేర్చాలని రేషన్ షాపులకు తక్కువ వస్తుందని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను నిలదీయడంతో కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక తట్టుకోలేక జీర్ణించుకోలేక కేవలం దుర్దశ పూర్వకంగ తక్కువ బియ్యం 450 గ్రాముల బియ్యం తక్కువ వస్తుందని ఎమ్మార్వో కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఎవరెన్ని అక్రమ ఫిర్యాదులు చేసిన ప్రజల్లో బచ్చురామ్ ఆదరణ తగ్గదని ఈ సందర్భంగా తెలిపారు.



## స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానం

**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :**
ఈ నెల 9వ తేదీన హైదరాబాదులో సెకండరీ గ్రేడ్ టీచర్ గా ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్న కొత్తకోట పట్టణానికి చెందిన కొండమ్మ - రాములు దంపతుల కుమారుడు నారమన్ నవీన్ కుమార్ ను "జే.ఎస్.రాములు ఫౌండేషన్" స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.భక్తరాజు, జె.అమృతరాజు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవనీయమైనదని విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కన్నా చాలా గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్సీ ఉద్యోగ విజేత నవీన్ కుమార్ ను శాలువాతో సన్మానిస్తూ అందరికీ ఆదర్శప్రాయుడైన భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సతీష్ రాజు, మహిమ రాజు, కర్ణ కుమార్, లెక్చరర్ సంతోష్ రాజు, జూనియర్ లైన్ మెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బాటలో బీఆర్ఎస్..

- తెలుగుదేశం విధానాన్ని పార్టీ ఆఫీసులో అమలు



**టీ మీడియా, అక్టోబర్ 11, హైదరాబాద్:** తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న పార్టీకి పెద్దగా ప్రియారిటి ఇవ్వని బీఆర్ఎస్ ఇప్పుడు పార్టీలో సమూల మార్పుల దిశగా అడుగులేస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వమే పార్టీని ప్రభుత్వం అంటూ.. అడపాదడపా మినహా పెద్దగా తెలంగాణ భవన్‌లో హడావుడి ఉండేది కాదు. ఇప్పుడు ఒక పూర్తి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ నిర్మాణం, కార్యాలయ కార్యకలాపాల విషయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ చాలా సిస్టమేటిక్ గా ఉంటుంది. అధికారంలో ఉన్న లేకపోయినా తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ విధానం గురించి అన్ని పార్టీల నేతలు మాట్లాడుకుంటారు.ఇప్పుడు కేసీఆర్ కూడా గతంలో రెండు దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా, ఎన్టీఆర్ ట్రస్ట్ మెంబర్‌గా, తెలుగుదేశం పార్టీ కార్యాలయ బాధ్యులుగా పని చేసిన రావుల చంద్రశేఖర్‌ని ప్రస్తుతం తెలంగాణ భవన్ ఇన్చార్జిగా నియమించారు. తెలుగుదేశం పార్టీలో నేతల ప్రెస్ మీట్లకు ముందు ఎలాగైతే పార్టీ నుంచి కొంత సమాచారం అందిస్తారు. ఇప్పుడు అలాంటి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. నిత్యం ఎవరో ఒక నేత తెలంగాణ భవన్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై రోజు కనీసం రెండు మూడు ప్రెస్ మీట్ అయినా ఉంటున్నాయి.వచ్చిపోయే కార్యకర్తలకు, మీడియా సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాలు కూడా ఏర్పాటు చేయించారు. పార్టీ కార్యకర్తల మెంబర్‌షిప్‌తో పాటు వచ్చే ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక విభాగం, పబ్లిక్ రిలేషన్స్- సోషల్ మీడియా కోసం మరొక వింగ్, రోజువారి కార్యకలాపాల కోసం మరికొంతమందిని ప్రత్యేకంగా నియమించారు. వీటితోపాటు త్వరలోనే కార్యకర్తలకు శిక్షణ తరగతులు కూడా ప్రారంభిస్తున్నట్లుగా సమాచారం.వీలైనన్ని సార్లు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ తెలంగాణ భవన్‌లోనే అందుబాటులో ఉంటున్నారు. మాజీ మంత్రులు కూడా తమ జిల్లాలకు నియోజకవర్గాలకు సంబంధించిన కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక వీటితోపాటు రుణమాఫీ అందని రైతుల వివరాలు సేకరించడానికి మరో స్పెషల్ సెల్, హైడ్రా బాధితుల కోసం ప్రత్యేక లీగల్‌సేల్, సోషల్ మీడియా ప్రతినిధులను అరెస్టు చేస్తే వారికి వెంటనే న్యాయ సాయం అందించడానికి మరి కొంతమంది ఇలా తెలంగాణ భవన్ ను ఫుల్ బిజీ చేశారు కేసీఆర్.

## ఆదిత్య రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- ఎం.దేవన్న యాదవ్



**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ లో ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డికి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం దేవన్న యాదవ్ , జిల్లా సేవాదళ్ జాను, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవన్న యాదవ్ మాట్లాడుతూ వనపర్తి యువతేజం, నవతరానికి నాయకుడు,చిన్నన్న ఆశయాలను నడిపించే యువ కెరటం, నిత్యం ప్రజలలో తిరిగే నిష్కల్మష సేవా తాత్పర్యుడు, నిరంతరం ప్రజాసేవకై పాటుపడుతున్న యువ నాయకుడు భవిష్యత్తులో రాజకీయంలో అత్యున్నతమైన పదవులు స్వీకరించాలని మనస్పూర్తిగా కోరుకుంటూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్పూర్తిగా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుద్యోగుల పక్షాన సిఎం కి కృతజ్ఞతలు

- మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి



**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** నిరుద్యోగుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మదనాపూర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, బిసి పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షులు మహేందర్ నాయుడు అన్నారు.డీఎస్సీ 2024 లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అజ్జకొల్లు గ్రామానికి చెందిన రవిని శుక్రవారం వారు సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన పేదింటి బిడ్డ టీచర్ పోస్టు దక్కించుకోవడం చాలా సంతోషకరమని అతి చిన్న వయసులో టీచర్ ఉద్యోగం పొంది గ్రామానికి మంచి పేరు తెచ్చినటువంటి రవిని చూసి యువత స్ఫూర్తి పొందాలన్నారు.విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నతంగా ఎదిగి జన్మనిచ్చిన తల్లితండ్రులకు , గ్రామానికి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు.10 ఏళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్ వేయకుండా నిరుద్యోగులని నిరాశపరిచారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలల్లోనే ఎన్నో నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజి రెడ్డి, సాయిబాబా, వాయిపట్ల పెద్ద కొండన్న, సుతారం మహేష్, బాలకృష్ణ, బడికిని దేవేందర్, శీను తదితరులు పాల్గొన్నారు.



## బిజెపిలో చేరిన యువకులు

- జిల్లా అధ్యక్షులు డి. నారాయణ

**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** వనపర్తి రూరల్ మండలంలోని క్రిష్ణగిరి గ్రామం నుండి వివిధ పార్టీల నుండి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బిజెపిలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో మూడవసారి కేంద్రంలో అధికారంలోకి రావడానికి బీజేపీ కార్యకర్తల సమిష్టి కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు అసెంబ్లీ సమన్వయకర్త మున్నూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్, జిల్లా కోశాధికారి బాసెట్టి శీను, ఉపాధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి%ు% మీడియా ఇంచార్జ్ పెద్దిరాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు పి రాములు, టిఆర్ఎస్ నాయకుడు పిసిను ఇల్లాలు కాంగ్రెస్ నాయకుడు పి రమేష్, నవీన్, హరికృష్ణ, బాలకృష్ణ, పి వంశీ, వి నరేష్ , వి మోహన్, ఆనంద్ , కె చరణ్, శ్రీ శ్రీ రామ్, సి శ్రీరామ్, పి అరవింద్, పి భరత్, శ్రీ మహేష్ , వి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

- శ్రీశైల దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి



**టీ మీడియా, అక్టోబర్ 11, మహానంది:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే పండుగ విజయ దశమి (దసరా) అని గాజులపల్లె టిడిపి నాయకులు,శ్రీశైల దేవస్థానం మాజీ ధర్మకర్త కలర్స్ రవి స్వామి అన్నారు. మహానంది మండలంలోని ప్రజలందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విజయదశమిని పురస్కరించుకుని ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి స్వామి మాట్లాడుతూ.. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు కలిగేలా దుర్గామాత దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకుంటున్నామని అన్నారు.ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకోవాలన్నారు. అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో బాగుండాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన




**టీ మీడియా అక్టోబర్ 11 చింతకుంట:** చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలోని ఎర్రగట్టు వద్ద అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలని లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన %=ుదీ% శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ శ్రీమతి. విజయేందిర బోయి, జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి ఆర్గనైజ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి చిన్నచింతకుంట మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వెంకటేష్ చింతకుంట కో ఆప్షన్ నెంబర్ మెహమూద్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సిద్ధి ధాత్రి దుర్గగా కామేశ్వరి అమ్మవారు..



**టీ మీడియా, అక్టోబర్ 11, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు శుక్రవారం వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దాతలచే గణపతి పూజ, పుణ్యాహ వాచనం, రుద్ర, చండీ హెూమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కూష్మాండ బలి సమర్పించారు. సాయంకాలం సహస్ర దీప అలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం రావణ వాహనంపై సిద్ధి ధాత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రావణ వాహనంపై సిద్ధి ధాత్రి దుర్గ అలంకారంలో అమ్మవారి గ్రామోత్సవం ఆలయ పురవీధుల వెంట ఘనంగా నిర్వహించారు. తదనంతరం దాతలు సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించి, వేద పండితులు దాతలకు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి



**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** నవరాత్రులలో చివరి రోజు సందర్భంగా గోపాల్ పేట మండల కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నిరంజన్ రెడ్డికి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయ దశమి ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు అష్టశ్వర్యాలు కలిగించాలని కోరుకున్నారు.అత్యంత వైభవంగా నవరాత్రులు జరిపిన నిర్వాహకులను నిరంజన్ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్,మండల పార్టీ అధ్యక్షులు బి.బాలరాజు, గుంద్రాతి.రాజేష్ గౌడ్,మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, చంద్రశేఖర్, శేఖర్, మతీన్, సత్యనారాయణ, గాజుల.శ్రీను, పానుగంటి.శేఖర్, ఎద్దుల.గోపాల్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ నో స్టాక్

- బాటిల్‌పై అదనపు బాదుడ
- దసరా వేళ జనం బేజారు



**టీ మీడియా,అక్టోబర్ 11,విజయవాడ:** ఒక వైపు ఆదాయం కోసం ప్రభుత్వం తపిస్తుంటే.. మరో వైపు మద్యం వ్యాపారం చేజారకూడదని లిక్కర్ సిండికేట్ కొత్త ఎత్తులు వేస్తోంది. ఇందులో భాగంగా సామధాన బేధ దంపోయాలను ముందుకు తెస్తోంది. రెండు మూడు రోజుల్లోనే చేతిలోని సరుకును వదిలించుకునే ప్లాన్ అమల్లోకి తీసుకొచ్చింది. మార్కెట్లో మద్యం కొరత ఉందని, బార్ల ముందు నోస్టాక్ బోర్డులు పెట్టేశారు. దీంతో లిక్కర్? కోసం జనం క్యూకడుతుండడం ఏపీలో కనిపిస్తోంది. క్వార్టర్ సీసాకు ?50 పెంచినా.. పండగ పూట మందు దొరకదనే భయంతో మద్యం ప్రియులు ఎగబడుతుంటే.. వైన్స్?, బార్లు కిటకిటలాడుతున్నాయి. దసరా పండుగకు మద్యం సిండికేట్ సృష్టించిన ఈ నోస్టాక్ సిస్టమ్? ఏపీలో గందరగోళం సృష్టిస్తోంది.

**పోతే పోనీ.. ఉన్నదే దక్కుతుంది.. :** ఏపీలో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తెరమీదకు తీసుకురాగా.. రెండు వారాలుగా మద్యం కృత్రిమ కొరత ఏర్పడింది. మొదట్లో దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. పోయే ఉద్యోగం ఉంటే ఎంత, పోతే ఎంత అనుకుని అందిన కాడికి మద్యం నిల్వలను బెల్టు షాపులకు తరలించారు. ప్రతి బాటిల్‌పై ?10 నుంచి ?25వరకు బ్రాండ్‌ను బట్టి అదనంగా వసూలు చేస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు పూర్తిగా మూతబడతాయి. ప్రభుత్వ దుకాణాల్లో విక్రయాలపై ఆంక్షల్ని లెక్క చేయడం లేదు. ఏపీబీసీఎల్ నుంచి మద్యం దుకాణాలకు సరఫరా చేసే బ్రాండ్ల సంఖ్య కూడా తగ్గిపోయింది. దుకాణాలకు బదులు బార్‌లకు సరఫరా చేయడం మేలని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. దీంతో సేల్స్ ఎక్కువగా ఉండే బ్రాండ్లు మద్యం దుకాణాల్లో కనిపించడం లేదు. దసరా పండుగను ఉత్సాహంగా చేసుకునే అసంఘటిత రంగ కార్మికుల జేబులకు ఈ రూపంలో చిల్లు పడుతోంది.

**బార్లకు కాసుల పంట :** మరోవైపు ప్రైవేట్ మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల కేటాయింపు ప్రక్రియ దసరా నాటికి కొలిక్కి తేవాలని భావించినా మద్యం సిండికేట్ల దెబ్బతో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. ఇక గడువు తేదీ పొడిగించక తప్పలేదు. శుక్రవారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు గడువు ఉంది. దుకాణాల లాటరీ ప్రక్రియను అనుకున్న గడువులోగా పూర్తి కాలేదు. దీంతో గత రెండు వారాలుగా బార్ అండ్ రెస్టారెంట్లకు కాసుల వర్షం కురుస్తోంది. ఎక్సైజ్ శాఖ కూడా వాటినే ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రతి క్వార్టర్ మీద ధర పెంచేసినా.. ఎక్సైజ్ అధికారులు కనీసం పట్టించుకోవటం లేదు.

## అడుక్కోవాలంటూ పిల్లలు వేధింపులు

- వృద్ధులైన తల్లిదండ్రులు ఆత్మహత్య



**టీ మీడియా,అక్టోబర్ 11,జైపూర్:** ఆస్తుల కోసం వృద్ధులైన తల్లిదండ్రులను పిల్లలు వేధించారు. దొంగ సంతకాలతో కొన్ని ఆస్తులను లాక్కున్నారు. తిండి పెట్టకుండా వారిని చిత్రహింసలకు గురి చేశారు. ఇంటి నుంచి వెళ్లిపోవాలని, అడుక్కొని బతకాలని హింసించారు. పిల్లల వేధింపులను తట్టుకోలేని ఆ వృద్ధ జంట ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి ముందు కొడుకులు, కూతుళ్లు హింసించిన తీరును సూసైడ్ నోట్‌లో రాసి ఇంటిలోని గోడకు అంటించారు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నాగౌర్‌లోని కర్ని కాలనీలోని ఇంట్లో 70 ఏళ్ల హజారీరామ్ బిష్ణోయ్, 68 ఏళ్ల అతడి భార్య చావలీ దేవి నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం ఆ ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, ఆ ఇంటికి చేరుకున్న పోలీసులు వాటర్ ట్యాంకులో పడి ఉన్న వృద్ధ జంట మృతదేహాలను గుర్తించారు. అలాగే ఆ ఇంటి గోడకు అంటించిన రెండు పేజీల సూసైడ్ నోట్‌ను గమనించారు. కుమారులు రాజేంద్ర, సునీల్ వారి భార్యలతో కలిసి తమ పేరుతో ఉన్న ఆస్తి కోసం కొట్టి హింసించినట్లు తల్లిదండ్రులు అందులో ఆరోపించారు. కుమార్తెలు మంజు, సునీత కూడా తమ కుటుంబాలతో కలిసి తమను వేధించారని ఆ నోట్‌లో పేర్కొన్నారు.మరోవైపు మూడు ప్లాట్లు, ఒక కారును దొంగ సంతకాలతో మోస పూరితంగా కొడుకులు, కుమార్తెలు తమ పేర్లపై మార్చుకున్నారని ఆ వృద్ధ దంపతులు ఆరోపించారు. అంతేగాక తమకు ఆహారం పెట్టకుండా వేధించారని, ఇంట్లోని గిన్నె తీసుకెళ్లి అడుక్కోవాలని కుమారుడు సునీల్ అన్నట్లు పేర్కొన్నారు. వేధింపుల గురించి ఎవరికైనా చెబితే చంపుతామని వారు బెదిరించినట్లు ఆరోపించారు. తమ పిల్లల వేధింపులు, హింసను తట్టుకోలేక తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆ నోట్‌లో రాశారు.కాగా, పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఆ ఇంట్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అయితే తమను కేసులో ఇరికించేందుకు తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా కుమారుడు సునీల్ సోమవారం లేఖ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ వృద్ధ దంపతులు మంగళవారం మరణించినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతామని ఎస్పీ వెల్లడించారు.

## బాలికల కోసం స్కూటర్లు కొనుగోలు

- పంపిణీ చేయక స్క్రాప్‌గా



**టీ మీడియా,అక్టోబర్ 11,జైపూర్:** నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలకు పంపిణీ కోసం 1,500 స్కూటర్లు కొనుగోలు చేశారు. అయితే ఏడాదిపైగా వాటిని పంపిణీ చేయలేదు. దీంతో రెండు ప్రభుత్వ కాలేజీల వద్ద ఉంచిన రూ.12 కోట్ల విలువైన ఆ స్కూటర్లు స్క్రాప్‌గా మారుతున్నాయి. రాజస్థాన్‌లోని బాన్స్‌వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలు ఇంటర్ విద్యను కొనసాగించేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం 'కాళీ బాయి భీల్ స్కూటీ పథకాన్ని 2020లో ప్రారంభించింది. రూ.80,000 చొప్పున 3000 స్కూటీలు కొనుగోలు చేసింది. వీటిలో 1500 స్కూటీలను బాలికలకు పంపిణీ చేశారు. మరో 1500 స్కూటీలను పంపిణీ చేయలేదు. బాన్స్‌వారాలోని విద్యామందిర్ ప్రభుత్వ కాలేజీ, హర్దేవ్ జోషి ప్రభుత్వ బాలికల కాలేజీ గ్రౌండ్‌లో వీటిని ఉంచారు.కాగా, 2023లో జరిగిన రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల వల్ల 1500 స్కూటీలను ఏడాదిగా బాలికలకు పంపిణీ చేయలేదు. దీంతో రెండు ప్రభుత్వ కాలేజీల గ్రౌండ్స్‌లో ఉంచిన అవి తుప్పుపట్టి స్క్రాప్‌గా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంపై ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మండిపడింది.మరోవైపు రాజస్థాన్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి బాబు లాల్ ఖరాడి దీనిపై స్పందించారు. ఈ స్కూటర్లను వారంలోపు బాలికలకు పంపిణీ చేస్తామని తెలిపారు. అయితే ఏడాదిగా కాలేజీ గ్రౌండ్‌లో ఉంచిన ఈ స్కూటీలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సమాధానాన్ని ఆయన దాటవేశారు. ఈ అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## వైభవంగా మంత్రార్చన



**టీ మీడియా,అక్టోబర్ 11,ఎన్టీఆర్ బ్యూరో :** వివిధ ఆలయాల అర్చకులు ఏకకంఠంతో జగన్మాత చెంత చేసిన పారాయణం భక్తి జ్ఞానంతో మారుమోగింది. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో దసరా వేడుకల్లో భాగంగా శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో కొలువైన అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.శ్రీ మల్లికార్జున స్వామి మహామండపంలోని ఆరవ అంతస్తులో శుక్రవారం అర్చకసభ వైభవోపేతంగా జరిగింది. పంచప్రాణాల్లో మొదటిది అర్చకుడి ప్రాణం. నడిచే హరి అర్చకుడు..అంటూ అర్చకులు ఇచ్చిన సందేశం, అర్చక సభలో వారు పాల్గొన్నందుకు వ్యక్తపరిచిన ఆనందంతో సభ సమ్మోహన భరితంగా సాగింది.వేదాలు, ధర్మాలు, సంప్రదాయాలు, ఆచరించడం, ప్రోత్సహించడం కొనసాగిస్తూనే ఉంటామని ఆలయ ఈవో కెఎస్ రామ రావు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో సనాతన ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఆయన చెప్పారు. ఆధ్యాత్మికతకు, వేదాలకు, విజయవాడ వేదిక అవుతుందని ఈవో ఆకాంక్షించారు.అర్చక సభ వంటి గొప్ప కార్యక్రమాలు కొనసాగించడానికి దుర్గామాత తమకు శక్తినివ్వాలని రామరావు కోరారు. అర్చక సభలో పాల్గొన్న 175 మంది అర్చకులకు 4,500 రూపాయలు చొప్పున పారితోషకం అందించారు. అర్చక సభకు అధ్యక్షత వహించిన వహించిన వారికి 5000 రూపాయలు పారితోషకం అందించారు. ఈ సభలో ఆలయ కార్యనిర్వాహణాధికారితోపాటు ఆలయ అధికారులు, పండితులు పాల్గొన్నారు.

## ర్యాంకర్ ని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా అక్టోబర్ 11 మదనాపూర్ :** ఇటీవల విడుదలైన ఉపాధ్యాయ ఫలితాలలో మదనాపురం మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన బడుగుల దేవ స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో వనపర్తి జిల్లా స్థాయి రెండవ ర్యాంకు సాధించాడు.ఈ సందర్భంగా బడుగుల దేవాను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు.

## ఉద్యోగ కల్పన, స్వయం ఉపాధి పై దృష్టి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**టీ మీడియా, అక్టోబరు 11, వనపర్తి బ్యూరో :** యువత ఉద్యోగ కల్పనతో పాటు స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి పట్టణంలో పట్టణ వాసి అయిన ప్రియాంక నూతనంగా ఏర్పాటు చేసుకున్న హాసిని లేడీస్ ఎంపోరియం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా స్వయం ఉపాధి పై దృష్టి సారించిన ప్రియాంకను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని సేవలో సిఐడి డైరెక్టర్



**టీ మీడియా, అక్టోబర్ 11, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను ఏపీ సి ఐ డి డైరెక్టర్ నగేష్ దంపతులు శుక్రవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు.స్వామి అమ్మ వాళ్లకు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆయన వెంట సి ఐ డి ఎస్ఐ భరత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ సుధీర్,రామిరెడ్డిలు పాల్గొన్నారు.

## విజయ దశమి శుభాకాంక్షలు

- మాజీ మంత్రిసింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరికి విజయం సాధిస్తుంది ఇదే దసరా పండుగ మనకి గుర్తుచేస్తుంది. అసత్యం పై సత్యం సాధించిన విజయాన్నివేడుక చేసుకునే సమయమే ఈ దసరా. మీరు చేసే ప్రతి పనిలోనూ దుర్గాదేవి బలాన్ని, శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ, మీరు వెళ్లే ప్రతి మార్గంలోనూ మీకు విజయం దక్కాలనిఆ అమ్మవారు తోడుగా నిలవాలని కోరుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకనలో ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## విజయ దశమి శుభాకాంక్షలు

- ఏఐపీసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**టీ మీడియా, అక్టోబర్ 11, వనపర్తి బ్యూరో :** చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరికి విజయం సాధిస్తుంది ఇదే దసరా పండుగ మనకి గుర్తుచేస్తుంది. అసత్యం పై సత్యం సాధించిన విజయాన్నివేడుక చేసుకునే సమయమే ఈ దసరా. మీరు చేసే ప్రతి పనిలోనూ దుర్గాదేవి బలాన్ని, శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ, మీరు వెళ్లే ప్రతి మార్గంలోనూ మీకు విజయం దక్కాలనిఆ అమ్మవారు తోడుగా నిలవాలని కోరుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు ఏఐపీసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ప్రకటనలో ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.


## దుర్గా పూజ వేడుక

- అసభ్యకర దుస్తుల్లో మోడల్స్



**టీ మీడియా,అక్టోబర్ 11,కోల్‌కతా:** దసరా నేపథ్యంలో ఏర్పాటు చేసిన దుర్గా పూజ మండపానికి ముగ్గురు మోడల్స్ వెళ్లారు. అసభ్యకరంగా ఉన్న దుస్తులను వారు ధరించారు. అలాగే కాళ్లకు చెప్పులతోనే మండపంలోకి వెళ్లారు. దుర్గా మాత విగ్రహం ముందు ఫొటోలు దిగారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు మోడల్స్ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. నవరాత్రుల నేపథ్యంలో కోల్‌కతాలో దుర్గా మాతా మండపాలను వినూత్న రూపాల్లో ఏర్పాటు చేస్తుంటారు.కాగా, మిస్ కోల్‌కతా మోడల్స్ అయిన హేమోశ్రీ, భద్ర, సన్నతి మిత్ర ఒక దుర్గా మాతా పూజా పండల్‌ను సందర్శించారు. అయితే సంప్రదాయ దుస్తులకు బదులుగా అసభ్యకరంగా, రెచ్చగొట్టేలా ఉన్న దుస్తులను వారు ధరించారు. అలాగే కాళ్లకు చెప్పులతోనే అమ్మవారి విగ్రహం వద్దకు వెళ్లి ఫొటోలు దిగారు.మరోవైపు ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో వారు పోస్ట్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ మోడల్స్‌పై నెటిజన్లు మండిపడ్డారు. దుర్గా పూజ వేడుకకు అసభ్యకర దుస్తుల్లో హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళ్లకు చెప్పులతో విగ్రహం ముందు ఫొటోలు దిగడాన్ని తప్పుపట్టారు. ఇది సిగ్గుచేటని కొందరు విమర్శించారు. దుర్గా మాత అమ్మవారిని, ఆధ్యాత్మికతను గౌరవించని వీరు ఎలాంటి మహిళలు అని మరికొందరు ప్రశ్నించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ




**టీ మీడియా,అక్టోబర్ 11,హైదరాబాద్ :** ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది. గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్ మున్సిపాలిటీ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్ గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలను ప్రభుత్వ ఆర్థిక సాయం అందించనున్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై అవగాహన, సోషల్ ఆడిట్, అధికారులతో సంప్రదింపులులాంటి కార్యక్రమాలను ఇందిరమ్మ కమిటీలు చేపట్టనున్నాయి.